క్లుప్తంగా

కాకాణిని కలిసిన మోహన్‌నాయుడు



వెంకటాచలం: మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ వెంకటాచలం మండలాధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు కలిశారు. అధ్యక్షుడిగా రెండోసారి నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కామాక్షితాయికి బంగారు మంగళసూత్రం బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని కామాక్షి తాయి అమ్మవారికి 207 గ్రాముల బంగారు మంగళసూత్రాన్ని ఏఎమ్మార్ గ్రూప్ అధినేత ఆల్తూరి మహేష్‌రెడ్డి, రాధిక దంపతులు ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. వీరిని ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుల నియామకం





మల్లికార్జున్‌రెడ్డి   సతీష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బుచ్చిరెడ్డిపాళెం పట్టణ, రూరల్ అధ్యక్షులుగా టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను విడుదల చేసింది. తమ నియామకానికి కృషి చేసిన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కృతజ్ఞతలను తెలియజేశారు.

సంక్రాంతిని సుఖసంతోషాలతో జరుపుకోవాలి

కోవూరు: సంక్రాంతిని ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కాంక్షించారు. కోవూరు నియోజకవర్గ ప్రజలకు పండగ శుభాకాంక్షలను తెలియజేశారు.



ప్రసన్నకుమార్‌రెడ్డి

తాటాకుల తరలింపు



పొదలకూరు: భోగి సందర్భంగా మంటలు వేసేందుకు ఆదివారం పలువురు తాటాకులను కొనుగోలు చేసి సైకిళ్లు, బైక్‌లు, ఆటోలపై ఇళ్లకు తీసుకెళ్లారు. మహిళలు ఇళ్ల వద్ద ప్రత్యేకంగా పొయ్యిలు ఏర్పాటు చేసి పిండి వంటకాల తయారీలో నిమగ్నమయ్యారు.

కాంగ్రెస్ నిరసన ర్యాలీ



మనుబోలు: బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు మనుబోలులో ర్యాలీ నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నారపరెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మొదట వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించారు. దళితవాడ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి గణేష్ యాదవ్ మాట్లాడుతూ అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీకి అంబేడ్కర్, రాజ్యాంగం పట్ల గౌరవం లేదన్నారు. కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ బాలగురవం, బళ్ల హరి తదితరులు పాల్గొన్నారు.

పార్కును గాలికొదిలేశారు!

- నీటి సౌకర్యం లేదు
- జనం లేక వెలవెల

పొదలకూరు: ఆ పార్కును ఎంతో విలువైన స్థలంలో ఏర్పాటు చేశారు. ఆహ్లాదకర వాతావరణంలో పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు సేద తీరేందుకు అనువుగా ఉన్న చోటు ప్రస్తుతం వెలవెలబోతోంది. ఒకప్పుడు పచ్చగా కనిపించిన పార్కు నేడు ఎండిన చెట్లతో దర్శనమిస్తోంది.

పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న పార్కును సుమారు మూడెకరాల స్థలంలో ఏర్పాటు చేశారు. లేఅవుట్ నిర్వాహకులు పంచాయతీ పేరుపై సుమారు రూ.1.50 కోట్ల విలువైన స్థలాన్ని రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. ఇది పిల్లలకు ఆటవిడుపుగా ఉండేది. అయితే కొంతకాలంగా ఇక్కడ నీటి సౌకర్యం లేకపోవడంతో చెట్లు ఎండుముఖం పట్టాయి. గతంలో గ్రామ పెద్దలు పట్టించుకుని పార్కుకు పూర్వవైభవం తీసుకొచ్చారు. పంచాయతీ నిర్వాహకులు నీటి సౌకర్యం కల్పించి చెట్లను కాపాడారు. ప్రస్తుతం పంచాయతీ నుంచి అందుతున్న నీరు కాలనీలకే సరిపోకపోవడంతో పార్కుకు సరఫరా అయ్యే పైపులైన్‌కు నీరందడం లేదు. పట్టణానికి సమీపంలో ఆహ్లాదకర వాతావరణంలో పార్కులేవీ లేకపోవడంతో చాలామంది కుటుంబ సమేతంగా సెలవు దినాల్లో లేఅవుట్‌లోని పార్కుకు వెళ్లి గడిపేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.



నిర్వహణ లేకుండా వదిలేసిన పార్కు

ఎన్నో సమస్యలు

నీటి సౌకర్యం లేకపోవడం, కాపలాదారుడిని నియమించకపోవడంతో పార్కు బాగుపడటం లేదు. గతంలో పాఠశాలల విద్యార్థులు మొక్కలు నాటారు. వాటిని సంరక్షించేందుకు డ్రిప్ ఇరిగేషన్ సదుపాయాన్ని కల్పించారు. తర్వాత వదిలేయడంతో అడవిని తలపిస్తోంది. పంచాయతీ అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు. నీటి వసతి కల్పిస్తే చెట్లను కాపాడుకునేందుకు వీలు కలుగుతుంది. అలాగే వదిలేస్తే అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

పునరుద్ధరిస్తాం

పంచాయతీ తరఫున పార్కును పునరుద్ధరిస్తాం. ఎంతో విలువైన స్థలం పంచాయతీకి సంబంధించినది కావడంతో కట్టుదిట్టం చేయడం జరుగుతుంది. సెక్రటరీతో మాట్లాడి వెంటనే పరిశీలిస్తాం.

– వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఉప సర్పంచ్, పొదలకూరు

అట్టముక్కలతో ‘పల్లె వాతావరణం’



ముత్తుకూరు: సంక్రాంతి సందర్భంగా మండలంలోని సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ విద్యార్థులు పల్లె వాతావరణాన్ని అట్టముక్కలపై తీర్చిదిద్దారు. గంగిరెద్దులు, గొబ్బెమ్మల వేడుకలు, హరిదాసుల నర్తనలు, ముగ్గులు వేసే పడుచుల బొమ్మలను తయారు చేశారు.

మర్యాదపూర్వకంగా..

కొడవలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా నియమితులైన చిమటా శేషగిరి నార్తురాజుపాళెంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావును మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన చలపతిరావు, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు.



చలపతిరావుకు పుష్పగుచ్ఛమిస్తున్న శేషగిరి

ఘనంగా వివేకానంద జయంతి

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు చేశారు. తొలుత ఆశ్రమంలోని గాంధీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేశారు. మేనేజర్ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు దుస్తుల అందజేత

ఇందుకూరుపేట: మండలంలోని పున్నూరులో గిరిజనులకు దుస్తులను ఆదివారం పంపిణీ చేశారు. ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే పొన్నెబోయిన చెంచు రామయ్య, ఆయన సతీమణి వత్సలమ్మ జ్ఞాపకార్థం కుమారుడు చెంచుకిశోర్, కోడలు లక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. 22 ఏళ్లుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.



గ్రామదేవతలకు పూజలు



పుష్పాలంకరణలో మనుబోలమ్మ

మనుబోలు: మండలంలోని గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మ, గంగమ్మలకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు ఫణీంద్రశర్మ శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన మనుబోలమ్మను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

తిక్కవరప్పాడులో నేటి నుంచి పోటీలు

వెంకటాచలం: సంక్రాంతి సందర్భంగా మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో సోమవారం నుంచి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ కొప్పోలు వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ వరకు క్రికెట్, వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. క్రికెట్‌లో మొదటి బహుమతి రూ.7 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, వాలీబాల్లో మొదటి బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

నిమ్మ మార్కెట్ యార్డుకు సెలవులు

పొదలకూరు: స్థానిక ప్రభుత్వ నిమ్మ మార్కెట్ యార్డుకు వరుసగా మూడు రోజులు సెలవులు ప్రకటించారని యార్డు అసోసియేషన్ ట్రెజరర్ మెంతెం బాలకృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. భోగి, సంక్రాంతి సందర్భంగా రెండు రోజులు సెలవులు ఇచ్చారన్నారు. బుధవారం యాథావిధిగా సెలవు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు గురువారం కాయలను తీసుకురావాల్సిందిగా సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం: సంక్రాంతిని పురస్కరించుకొని అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు తన కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. పండగ సందర్భంగా ఊళ్లకెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎల్‌హెచ్‌ఎమ్మెస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోడి పందేలు, పేకాట తదితరాలను నిర్వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎస్సై సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోలీసులు

ఈతతో సంపూర్ణ ఆరోగ్యం



కోవూరు: ఈతతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీనియర్ స్విమ్మర్ మునగా నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని పోతిరెడ్డిపాళెంలో పెన్నాపై ఉన్న శివాలయం వద్ద పలువుర్ని ఆదివారం సత్కరించారు. సీపీఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, పార్టీ కార్యవర్గ సభ్యుడు చెంగయ్య, దుబాయ్ ఇంటర్నేషనల్ స్విమ్మింగ్ పోటీల్లో పతకాలను సాధించిన హరిసింగ్, కనిగిరి రిజర్వాయర్ నీటిపారుదల కమిటీ శాఖ ఉపాధ్యక్షుడిగా ఎన్నికై న రేబాలకు చెందిన రమణారెడ్డిని సన్మానించారు. సీనియర్ స్విమ్మర్స్ పెంచలయ్య, వెంకటేశ్వరరావు, వెంకటరమణారెడ్డి, భాస్కర్‌రావు, శ్రీధర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, రాజా, నారపనాయుడు, సుధాకర్‌రాజు, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛనర్ల అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక



బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ బుచ్చిరెడ్డిపాళెం శాఖ నూతన కమిటీ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో పింఛనర్ల అసోసియేషన్ సమావేశాన్ని జరిపారు. కమిటీ అధ్యక్షుడిగా మాల్యాద్రి, అసోసియేట్ అధ్యక్షుడిగా రఘునాథరావు, కార్యదర్శిగా యానాదయ్య, గౌరవాధ్యక్షుడిగా రమణయ్య, ట్రెజరర్‌గా వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసన్, పెంచలనారాయణ, రఘునాథరావు, సుబ్బయ్య, రమణయ్య, సంయుక్త కార్యదర్శులుగా మల్లికార్జునరావు, మస్తాన్‌రావు, రమణయ్య, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అనంతరం లైఫ్ సర్టిఫికెట్లను అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణయ్య, జిల్లా అధ్యక్షుడు గౌస్, శ్రీనాథ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషు, మండల ప్రధాన కార్యదర్శి హజరత్‌బాబు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కేసులు

- సీఐ శివరామకృష్ణారెడ్డి

పొదలకూరు: పొదలకూరు, మనుబోలు మండలాల పరిధిలో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠినంగా వ్యవహరించడంతోపాటు కేసులు నమోదు చేస్తామని సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్, జంతు హింస నివారణ చట్టం కింద చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే 112కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. పండగలకు ఇతర గ్రామాలు, దూరప్రాంతాలకు వెళ్లేవారు ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలను ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిచయం లేని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ లేదా ఇతర వివరాలు అడిగితే వెల్లడించవద్దని సీఐ పేర్కొన్నారు.

కోడూరు తీరానికి పోటెత్తిన సందర్శకులు



తోటపల్లిగూడూరు: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు సాగర తీరం ఆదివారం సందర్శకులతో కోలాహలంగా మారింది. సంక్రాంతి సందర్భంగా సెలవులు రావడంతో జిల్లా నలుమూలల నుంచి జనం తరలివచ్చారు.

పార్టీ పటిష్టతకు కృషి

పొదలకూరు: మండలంలో వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి చేస్తానని పెదమల్లు రమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తనను మరోసారి మండలాధ్యక్షుడిగా నియమించేందుకు కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

హరగోపాల్‌రెడ్డికి అభినందనలు



హరగోపాల్‌రెడ్డిని అభినందిస్తున్న నాయకులు

మనుబోలు: వరుసగా మూడోసారి వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడిగా నియమితులైన బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డిని ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఆదివారం కలిశారు. ముంగర రవీంద్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ఏలూరు భాస్కర్‌రెడ్డి, చల్లా నవకోటి, ఉచ్చూరు కమలాకర్‌రెడ్డి, చలగల దయాకర్, తుపాలకు గిరి తదితరులు ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

అందరూ ఒకేచోట చేరి..



సహపంక్తి భోజనాలు (ఫైల్)



గత సంవత్సరం పండగ సందర్భంగా.. (ఫైల్)

పొదలకూరు: సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లాలని, బంధుమిత్రులతో ఆనందంగా గడపాలని అనేకమంది ఆసక్తి చూపుతుంటారు. ఒకేచోట చాలా కుటుంబాలు చేరి పండగను ఆస్వాదించడం జరుగుతోంది. పొదలకూరు పట్టణానికి చెందిన తమ్మల బ్రదర్స్‌ది పెద్ద కుటుంబం. దగ్గరలోనే నివాసాలు ఉంటున్నారు. సంక్రాంతి వచ్చిందంటే తమ బిజీ లైఫ్‌ను పక్కన పెట్టి మూడురోజులు సంబరాలు నిర్వహిస్తారు. దూరప్రాంతాల్లో ఉన్న బంధువులను ఆహ్వానించి సుమారు వంద మంది ఒకేచోట చేరి సంప్రదాయబద్ధంగా పండగను నిర్వహిస్తారు. వనభోజనాలు ఏర్పాటు చేస్తారు. పిల్లలకు భోగిపండ్లు పోస్తారు. ఒకే డ్రస్ కోడ్‌తో ఆకట్టుకుంటారు.

ఆటపాటలతో గడిపేస్తాం



మాకు తోటలున్నాయి. సంక్రాంతి బంధువులు రెండు రోజుల ముందుగానే వస్తారు. వనభోజనాలతోపాటు అక్కడే ఆటపాటలతో గడిపేస్తాం. మూడురోజులు ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. ఐదేళ్లుగా ఇలాగే కలుస్తున్నాం.

– తుమ్మల ప్రసాద్, పొదలకూరు

ఆనందంగా ఉంటుంది



సంప్రదాయం కోసమే ఏడాదికొక పర్యాయం సంక్రాంతి సందర్భంగా అందరం కలుస్తుంటాం. ఒకచోటే చేరి వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేయడం ఆనందంగా ఉంటుంది.

– తుమ్మల శిరీష, పొదలకూరు

బంధుగణం అధికం



తుమ్మల కుటుంబానికి బంధుగణం అధికంగా ఉంది. మంచి సంబంధాలు ఉండాలని సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తాం.

– తుమ్మల పెంచలయ్య, పొదలకూరు

సంప్రదాయంగా పెట్టుకున్నాం



సంక్రాంతి వచ్చిందంటే బంధువులను కలవడం సంప్రదాయంగా పెట్టుకున్నాం. అంతా ఒకచోట చేరి సంబరాలు నిర్వహిస్తాం. దూరప్రాంతాల నుంచి వచ్చి ఆనందంగా గడిపి వెళ్తాం.

– జగదీశ్వరి, ప్రొద్దుటూరు